

శబ్దం పెరిగిందో..

వాహనాలతో పాటు వచ్చే సైలెన్సర్లను తొలగించి భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లను వాడడంతో శబ్ద కాలుష్యం పెరుగుతోంది. దీనిపై జిల్లా పోలీసులు దృష్టి సారించారు. - 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.56,650
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,060
3 శాతం జీఎస్టీతో	రూ.5,212
నవర (8 గ్రా)	రూ.41,696

గరిష్టం/కనిష్టం
31.1 /23.1

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు కాస్త తగ్గనున్నాయి. ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. గాలిలో తేమ 69 శాతం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన జిల్లా జడ్జి



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న జిల్లా జడ్జి యామిని

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ చక్రధర్‌బాబును జిల్లా జడ్జి యామిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బంగారు సరుడు బహూకరణ



ఈఓ వెంకటేశ్వర్లుకు బంగారు సరుడును అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి, గంగాదేవిలకు దాతలు ఆదివారం బంగారు సరుడును బహూకరించారు. మండలంలోని దామరమడుగుకు చెందిన చింతలపల్లి శ్రీధర్‌రెడ్డి, మాధవి దంపతులు స్వామి, అమ్మవార్లకు జరిగే నిత్య కల్యాణంలో ఉత్సవ మూర్తులకు అలంకరించేందుకు 15.560 గ్రాముల బరువు కలిగిన బంగారు సరుడును అందజేశారు. ఈ సందర్భంగా దాతలను స్వామివార్ల శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్ పాల్గొన్నారు.


సోమశిలలో 71.886 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం నాటికి 71.886 టీఎంసీలు ఉన్నాయి. 7,195 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 450, దక్షిణకాలువకు 300, కండలేరుకు 1600 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టుకు టీడీపీ శాపం



- శంకుస్థాపన.. కాంట్రాక్ట్ రెండూ డూపే
- టీడీపీ నేతల భూదందానే అడ్డంకి
- అధికారంలో ఉన్న ఐదేళ్లూ మౌనం
- ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు వారాల ముందు స్టిక్కర్ శిలాఫలకాలు
- రాష్ట్ర బడ్జెట్‌లో రూపాయి నిధులు కేటాయించని బాబు
- ఇప్పుడొచ్చి వగలాడి మాటలు



విమానాశ్రయానికి సేకరించిన భూముల మ్యాప్

దామవరం ఎయిర్‌పోర్టుకు టీడీపీ నేతల భూదందానే శాపగ్రస్తంగా మారింది. అధికారంలోకి రాగానే ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత ప్రైవేట్, ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేసి రాబంధుల్లా ఆ భూములను తమ కబంధహస్తాల్లో పెట్టుకున్నారు. భూ వివాదాలు చెలరేగడంతో ఒక దశలో ఎయిర్‌పోర్టును రద్దు చేసే పరిస్థితి కూడా వచ్చింది. ఎయిర్‌పోర్టు నిర్మాణంపై చిత్తశుద్ధి లేని అప్పటి టీడీపీ ప్రభుత్వం తమ పార్టీ నేతలు సృష్టించిన భూ వివాదాలు పరిష్కరించకుండానే ఎన్నికలకు రెండు వారాల ముందు స్టిక్కర్ ఫ్లెక్సీలతో శంకుస్థాపన చేసిన చంద్రబాబు మొన్నొచ్చి మాట్లాడిన వగలాడి మాటలు జిల్లా ప్రజలను విస్తుపోయేలా చేశాయి.

కావలి: దామవరం విమానాశ్రయాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆద్యంతం డూప్ షోగా సాగించింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించాల్సిన ఎయిర్‌పోర్టు శంకుస్థాపన డూప్ షో చేసింది. ఐదేళ్లు అధికారంలో ఉండీ ఏ బడ్జెట్‌లోనూ రూపాయి నిధులు కేటాయించని చంద్రబాబు ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు వారాల ముందు హడావుడిగా స్టిక్కర్లతో శిలాఫలాలు వేసి శంకుస్థాపన చేశారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ ప్రతిపాదిత భూముల్లో పిచ్చిమొక్క కూడా పీకలేదు. దీన్ని బట్టి కాంట్రాక్టర్ డూప్ అని తేటతెల్లమైంది.

జిల్లాకే ప్రతిష్టాత్మకమైన దామవరం ఎయిర్‌పోర్టుకు టీడీపీ నేతల భూ దోపిడీనే శాపంగా మారింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు భూ దోపిడీ పర్వాన్ని కొనసాగించారు. ఆ శాపం నుంచి విముక్తి కలిగించేందుకు మూడున్నరేళ్లుగా ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నా సానుకూల ఫలితాలు రావడం లేదు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిపక్ష నేత చంద్రబాబు దామవరంలో విమానాశ్రయ నిర్మాణం చేపట్టలేదని రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన విమర్శలు స్వయంగా ఆ పార్టీ నేతలనే ఖంగుతినేలా చేశాయి. భూ రాబందుల్లా మారిన టీడీపీ నేతల నిర్వాకం కారణంగానే విమానాశ్రయ నిర్మాణం నిలిచిపోయిందని జిల్లా అంతా తెలిసినా చంద్రబాబు మాత్రం యథావిధిగా ప్రభుత్వంపైనే ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా మారింది. భూ దోపిడీ ద్వారా విమానాశ్రయ నిర్మాణానికి సైంధవుల్లా అడ్డుపడిన జిల్లా నేత, భూదందా చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి, అతని బినామీని పక్కన పెట్టుకునే చంద్రబాబు పసలేని విమర్శలు చేయడం విశేషం.

ఇదీ విమానాశ్రయం కథ

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసే క్రమంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో జిల్లా పర్యటనలో విమానాశ్రయాన్ని ప్రకటించారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజలకు అందుబాటులో ఉండేలా, జాతీయ రహదారిని ఆనుకుని రవాణాకు సౌకర్యంగా ఉండేలా కావలి నియోజకవర్గంలోని దామవరం వద్ద విమానాశ్రయ నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 2,300 ఎకరాల్లో భారీ విమానాశ్రయం నిర్మించేలా డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే దురదృష్టవశాత్తు ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అకాల మరణం చెందడంతో అనంతరం ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన కొణిజేటి రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదు. 2009–2014 మధ్య విమానాశ్రయ నిర్మాణంపై నిర్లిప్తత ఆవరించగా భూసేకరణ ప్రక్రియ నత్తనడకన సాగింది. 2014లో టీడీపీ అధికారంలో రావడంతో విమానాశ్రయ అంశం మరోమారు తెర పైకి వచ్చింది. అధికారం అండ చూసుకుని టీడీపీ నేతలు విమానాశ్రయం నిర్మించ తలపెట్టిన భూములు ఉన్న ప్రాంతంపై రాబంధుల్లా వాలిపోయారు. ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత ప్రభుత్వ, ప్రైవేట్ భూములపై పడి నకిలీ రిజిస్ట్రేషన్లు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. దీంతో మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు విమానాశ్రయం కోసం భూసేకరణ వ్యవహారం తల బొప్పి కట్టేలా చేసింది. దామవరం ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణ భూముల అసలు యజమానులు ఎవరో, నకిలీలు ఎవరో తేల్చుకోలేక అధికారులు భీతిల్లిపోయారు. ఏ నిర్ణయం తీసుకుంటే తమ ఉద్యోగాలకు ఎసరు తెస్తుందో అని వణికిపోయారు. ఈ క్రమంలో 2016లో అప్పటి కలెక్టర్‌గా ఉన్న జానకి దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ చేయడం సాధ్యం కాదని, అన్నీ కూడా వివాదాస్పద భూములే అని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో 2017 మే నెల 18న నెల్లూరుకు వచ్చిన అప్పటి రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు కల్పన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి, దామవరంలో విమానాశ్రయం నిర్మాణ ప్రతిపాదనలను రద్దు చేసి, దానిని పక్క జిల్లాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లుగా ప్రకటించారు. దీంతో అన్ని రాజకీయ పార్టీలు అధికార టీడీపీ నేతల వైఖరిని తూర్పార బట్టాయి. ప్రజల్లో కూడా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే కదలిక

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక విమానాశ్రయ నిర్మాణానికి భూ సేకరణపై దృష్టి పెట్టి వివాదాలు పరిష్కరిస్తూ 1,310 ఎకరాలు సేకరించింది. కేంద్ర విమానాయన శాఖకు చెందిన 'ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా' దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి సాంకేతిక అనుమతులు మంజూరు చేసింది. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాశ్రయ నిర్మాణ సంస్థ తమ వద్ద నిధులు లేవని ఏడాదిన్నర తర్వాత చావు కబురు చల్లగా చెప్పింది. ఈ క్రమంలో నిర్మాణ ప్రక్రియ మొదటికి వచ్చింది. ఈ నేపథ్యంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇటీవల ముంబయికి చెందిన విమానాశ్రయ నిర్మాణ సంస్థ ప్రతినిధులను సంప్రదించి వారిని దామవరం తీసుకొచ్చి భూములు, విమానాశ్రయ లాభదాయక నిర్వహణ అంశాలను తెలియజేశారు. ఇది ప్రైవేట్, ప్రభుత్వం భాగస్వామ్యంతో నిర్మించి, నిర్వహించే విమానాశ్రయం కావడంతో ఈ రంగంలో అనుభవం ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించే పనిలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

చంద్రబాబు ప్రభుత్వం నడిపిన డ్రామా

దామవరం వద్ద ఎయిర్‌పోర్టు రద్దు వివాదం నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం సరికొత్త డ్రామాకు తెరతీసింది. ఇక్కడే ఎయిర్‌పోర్టును నిర్మిస్తున్నట్లు మళ్లీ ప్రకటించి రెండేళ్లకు పైగా షో చేసింది. తొలుత ప్రతిపాదిత భూ విస్తీర్ణాన్ని కుదించింది.

- 1,352 ఎకరాల్లో రూ.398.56 కోట్లతో దామవరంలో విమానాశ్రయం నిర్మించడానికి సెప్టెంబర్ 2017లో ఓ నిర్మాణ సంస్థకు చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు.
- ఈ మేరకు 21 జూన్ 2018లో ఆ నిర్మాణ సంస్థతో ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకుంది. ఆ అగ్రిమెంట్‌లో నిర్మాణ సంస్థ తన ఆర్థిక వనరులను కనపరచాల్సి ఉంది. అయితే అదే ఏడాది డిసెంబర్ 21వ తేదీ వరకు కూడా నిర్మాణ సంస్థ తన ఆర్థిక వనరులను ప్రభుత్వానికి చూపలేదు. ఇదొక బోగస్ నిర్మాణ సంస్థ అని తెలిసినా.. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో ప్రజలను మభ్యపెట్టేందుకు విమానాశ్రయ నిర్మాణానికి 11 జనవరి 2019 శంకుస్థాపన చేశారు.
- ఆ తర్వాత ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వం మారింది. ఎయిర్‌పోర్టు నిర్మాణ కాంట్రాక్ట్ పొందిన సంస్థ పనులు ప్రారంభిస్తుందని ఏడాది పాటు ప్రభుత్వం ఎదురు చూసింది. పలుమార్లు నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ నిర్మాణ సంస్థ నుంచి ఎటువంటి ప్రతిపాదనలు రాకపోవడంతో 15 జూలై 2019లో నిర్మాణ సంస్థతో ప్రభుత్వం అగ్రిమెంట్‌ను రద్దు చేసింది.
- దీన్ని బట్టి నిర్మాణ సంస్థ ఓ బోగస్, శంకుస్థాపన ఒక డూప్ షో అని తేలిపోయింది.

దామవరంలోనే విమానాశ్రయం



దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి టీడీపీ నాయకులు చేసిన దుర్మార్గాలు దారుణాల వల్లే సమస్య జటిలంగా మారింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే భూసేకరణ చిక్కుముళ్లను ఎలా హ్యాండిల్ చేయాలో తెలియక అధికారులు దామవరంలో విమానాశ్రయం నిర్మించడానికి సాధ్యపడలేదన్నారు. ఎన్నికలకు ముందు అదే చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇవన్నీ టీడీపీ ప్రజలను వంచించే పనులకు పరాకాష్ట. దామవరం విమానాశ్రయ నిర్మాణానికి సంక్లిష్టతగా మారిన భూసేకరణ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిగమించింది. కేంద్ర ప్రభుత్వ అనుమతులు కూడా మంజూరు చేయించగలిగింది. అయితే నిర్మాణానికి పెట్టుబడులు పెట్టే వారికి కోసం ప్రయత్నాలు చేస్తున్నాం.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కావలి

ఊరూవాడా.. మురిపించెన్



పెరిగిన రూ.2,750 పింఛన్ అందుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను ముద్దాడుతున్న నెల్లూరు నగరంలోని 21వ డివిజన్ ఉమ్మారెడ్డిగుంటకు చెందిన వృద్ధురాలైన సరోజనమ్మ

- తొలిరోజు 80.14 శాతం మందికి కానుక పంపిణీ
- అట్టహాసంగా వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలు

నెల్లూరు (పొగతోట): కొత్త సంవత్సరం రోజు పెరిగిన పింఛన్ అందుకున్న లబ్ధిదారులు ఊరూవాడా మురిసిపోయారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద పండగలా పింఛన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,66,401 కొత్త పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆదివారం వెంకటాచాలం మండలంలోని ఎర్రగుంటలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలను ప్రారంభించారు. నూతనంగా పింఛన్ కానుక మంజూరైన లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు వారోత్సవాల్లో పాల్గొని లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. పలుచోట్ల సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు.

జిల్లాలో జనవరి నెల నుంచి కొత్తగా 12,332 పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పాటు గతంలో రూ.2,500 ఉన్న నుంచి రూ.2,750లకు పెంచింది. వారం రోజుల పాటు పింఛన్ కానుక వారోత్సవాలు నిర్వహించేలా డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆదివారం కొత్త సంవత్సరం ప్రారంభం రోజు తెల్లవారుజాము నుంచే వలంటీర్లు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీకి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 3,14,237 మంది లబ్ధిదారులకు రూ.87.70 కోట్ల నగదు పంపిణీ చేయాల్సి ఉంది. మొదటి రోజు 2,51,838 మందికి కానుక పంపిణీ చేయడంతో 80.14 శాతం పంపిణీ పూర్తయింది.



నెల్లూరు నగరంలోని 21వ డివిజన్ ఉమ్మారెడ్డిగుంటలో పింఛన్ అందుకుని కవరుపై ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను చూసుకుని మురిసిపోతున్న వృద్ధురాలు లలితమ్మ



నెల్లూరు 21వ డివిజన్ ఉమ్మారెడ్డిగుంటలోని సొతూరు రమణమ్మకు ఆమె నివాసంలో వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తున్న వలంటీరు యమున

ప్రభావదీపిక

ఒక దీపం వెలిగింది. మౌనరోదన మోములో సంతోషం వెల్లివిరిసింది. జీవన తేజంతో నవ్వులు పూయించింది. చీకట్లు ముసిరిన ఆ ఇంట ప్రభాత వెలుగులు నింపాయి. ఆ దివ్యాంగురాలి జీవనానికి ఆసరా దొరికింది. ఆమె జీవితానికి భరోసాగా నిలిచింది. ఆ ప్రభావ ప్రభాత దీపిక పేరే 'పింఛన్'. అర్హులైన అభాగ్యులపై ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి నిలువెత్తు నిదర్శనం.

- కొత్త సంవత్సరం వేళ ఆ దివ్యాంగురాలి జీవితంలో కొత్త వెలుగు
- వలంటీర్ చొరవతో వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3,000 మంజూరు
- సాంకేతిక సమస్యలు పరిష్కరించే చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- ఆమె ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్ అందజేసిన ఎమ్మెల్యే



పింఛన్ మంజూరైన విషయాన్ని యువతికి చెబుతున్న ఎమ్మెల్యే, యువతి సంతోషం

కావలి: ఆమెకు 28 ఏళ్లు. పుట్టుక నుంచే శరీరంలో ఏ అవయవం పని చేయదు. కదల్లేదు. మాట్లాడలేదు. శారీరకంగా.. మానసికంగా దివ్యాంగురాలు. 20 ఏళ్లుగా ఆమె బతుకు దెరువుకు ఆసరాగా సామాజిక పింఛన్ కోసం కుటుంబ సభ్యులు అలుపెరగని పోరాటం చేసి అలసిపోయారు.

కావలి పట్టణం 39వ వార్డులోని మూర్తిశెట్టివారివీధికి చెందిన ఈశ్వరమ్మ దివ్యాంగురాలు. తండ్రి చనిపోయాడు. తల్లి సైతం మానసికంగా కుంగిపోవడంతో ఆమె పనులే ఆమె చేసుకోలేని దయనీయ పరిస్థితి. తల్లికి వైఎస్సార్ వితంతు పింఛన్ కానుక వస్తోంది. తల్లిని, చెల్లిని సోదరుడు కూలి పనులు చేసి పోషిస్తున్నాడు. అతని భార్యే ఇటు అత్తను, అటు దివ్యాంగురాలైన ఆడపడుచుకు సపర్యాలు చేస్తోంది.

వలంటీర్ చొరవతో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక ఆ దివ్యాంగురాలి దయనీయ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆమెకు పింఛన్ మంజూరు చేయించేందుకు కృషి చేశారు. ఆమెకు ఆధార్‌కార్డు లేదు. రేషన్ కార్డులేదు. దీంతో ఆమెకు పింఛన్ మంజూరు చేయలేని పరిస్థితి నెలకొంది. ఆమెకు వేలిముద్రలు ఆధార్ కార్డుకు సరిపోవడం లేదు. కుడి చేయిలో ఒక వేలి ముద్ర మాత్రమే రికగ్నైజ్ అవుతోంది. అధికారులు చర్యలు చేపట్టి ఆమెకు ఆధార్ కార్డును వచ్చేలా చేశారు. ఈలోగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఆమె నివాసం ఉంటున్న వార్డుకు ఎంపికైన వలంటీర్ గణవరపు అనూషా ఆమెకు పింఛన్ కల్పించేందుకు స్వయంగా తన సొంత డబ్బులు ఖర్చులు పెట్టుకుని తిరిగి కృషి చేసింది. పింఛన్ మంజూరు కోసం తొలుత రేషన్ కార్డు మంజూరు చేయడానికి సాంకేతిక కారణాలతో ఆధార్ లింక్ కాక పెండింగ్‌లో పడింది. దీంతో రెండు మూడు సార్లు ఆధార్ కార్డును అప్‌డేట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరికి పర్మినెంట్ నంబరుతో తల్లి రేషన్‌కార్డులో ఈశ్వరమ్మను యాడ్ చేయించింది. చివరగా సదరం సర్టిఫికెట్ కోసం నాలుగైదు సార్లు నెల్లూరుకు తిరిగింది. కరోనా రావడం తో సదరం సర్టిఫికెట్లు మంజూరు నిలిచిపోయింది. ఇటీవల సదరం సెంటర్ పునః ప్రారంభం కావడంతో ఎట్టకేలకు సదరం సర్టిఫికెట్ మంజూరు కావడంతో పింఛన్‌కు నమోదు చేసింది. తాజాగా మంజూరు అయిన పింఛన్ల జాబితాలో ఆమె పేరు వచ్చింది.

ప్రభాత వేళ.. ఆనంద హేళ

ఆమెకు పింఛన్ మంజూరు కావడంతో ప్రభాత వేళ మంచు తెరలను దాటుకుంటూ స్వయంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వలంటీరు, సచివాలయ ఉద్యోగులను వెంట పెట్టుకొని ఆ యువతి ఇంటికి వెళ్లి పింఛన్ వచ్చిన విషయాన్ని తెలియజేశారు. దీంతో భావోద్వేగంతో ఆనంద భాష్పాలు కార్చింది. చాలా కాలం తర్వాత తనకు పింఛన్ వచ్చేలా చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ సైగలు చేసింది. ఎమ్మెల్యే సైతం ఆమెను అభినందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖతో పాటు రూ.3 వేల నగదు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉంటే ప్రతి ఒక్కరికీ పింఛన్ అందుతుందని చెప్పారు. అన్ని విధాలా వలంటీర్లు స్వయంగా సేవా దృక్పథంతో పని చేసి ప్రజలకు అండగా ఉంటారని ఈ ఉదంతం ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

నేటి నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

- 1 నుంచి 10వ తరగతి వరకు
- ఎస్సీఈఆర్టీ ప్రశ్నపత్రాలతోనే పరీక్షలు
- హాజరుకానున్న 3.82 లక్షల మంది విద్యార్థులు



నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమ్మేటివ్-1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సోమవారం నుంచి, 1 నుంచి 5వ తరగతి వరకు ఈ నెల 4వ తేదీ నుంచి పరీక్షలను నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3.82 లక్షల మంది సమ్మేటివ్-1 పరీక్షలకు హాజరుకానున్నారు. ఎస్సీఈఆర్టీ రూపొందించిన ప్రశ్న పత్రాలతోనే ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

పరీక్షల టైంటేబుల్

ఈ నెల 2న 6, 8, 10 తరగతులకు ఓఎస్సెస్సీ పేపరు-1 పరీక్ష ఉంటుంది. 7, 9 తరగతులకు కాంపోజిట్ కోర్సు సంస్కృతం, హిందీ, అరబిక్ పర్షియా పేపరు-1 ఉంటుంది. 3న 8, 10 తరగతులకు ఎఓస్సీస్సీ పేపరు-2 పరీక్ష, మధ్యాహ్నం 9వ తరగతికి కాంపోజిట్ కోర్సు పేపరు-2 పరీక్ష ఉంటుంది. 4న తెలుగు, 5న సెకండ్ లాంగ్వేజ్ (హిందీ), 6న ఇంగ్లిష్, 7వ తేదీ 8వ తరగతికి సోషల్, 6, 7, 9, 10 తరగతులకు గణితం, 9న జనరల్ సైన్స్, 10వ తేదీ 8వ తరగతికి గణితం, మిగిలిన తరగతులకు సోషల్ స్టడీస్ పరీక్షలు ఉంటాయి. 6, 8, 10 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తారు. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు 80 మార్కులకు, 9, 10 తరగతులకు 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది.

1 నుంచి 5వ తరగతి పరీక్షల షెడ్యూల్

ఈ నెల 4న తెలుగు, 5న ఇంగ్లిష్, 6న గణితం, 7న 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలు ఉంటాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

- జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఎస్సీఈఆర్టీ తయారు చేసిన ప్రశ్న పత్రాలతోనే పరీక్షలు నిర్వహించాలి.
- 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 6 పేపర్లల్లో (పీఎస్, బీఎస్ కలిపి 1 పేపరు) సంగ్రాహణాత్మక మదింపు పరీక్షలు నిర్వహించాలి.
- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులకు 1 నుంచి 8వ తరగతి వరకు రెండు మీడియా (తెలుగు, ఇంగ్లిష్)ల్లో ప్రశ్న పత్రాలను పంపించారు. 9, 10 తరగతులకు గతంలో మాదిరి ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తారు.
- అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా మ్యాథ్స్, సైన్స్‌లో బైజూస్ యాప్‌లో ఇచ్చిన సిలబస్ నుంచి తయారు చేయబడిన ప్రశ్నపత్రాలతో పరీక్షలు నిర్వహించాలి.
- 1 నుంచి 5వ తరగతి వరకు ప్రశ్న పత్రాలను కాంప్లెక్స్ హెడ్‌మాస్టరు కాంప్లెక్స్‌లోని పాఠశాలలకు రోజువారీ ప్రశ్న పత్రాలను ఇవ్వాలి.
- 6 నుంచి 10వ తరగతి ప్రశ్న పత్రాలను అన్ని పాఠశాలలకు ఎమ్మార్సీ నుంచి మాత్రమే ప్రతిరోజు టైంటేబుల్ అనుసరించి ఒక గంట ముందుగా ఇవ్వాల్సి ఉంటుంది.
- పరీక్షల అనంతరం ఉపాధ్యాయులు వారివారి సబ్జెక్ట్‌ల్లో స్వయంగా కీ తయారు చేసుకుని పరీక్ష తదనంతరం జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలి. విద్యార్థులు పొందిన మార్కులను సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు నిర్ణీత సమయం లోపల సీఎస్ఈ వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. జవాబు పత్రాలను తనిఖీ అధికారుల పరిశీలనార్థం భద్రపరచాల్సి ఉంటుంది.

ఎస్సీఈఆర్టీ ప్రశ్నపత్రాలతోనే పరీక్షలు

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఎస్సీఈఆర్టీ రూపొందించిన ప్రశ్న పత్రాలతోనే పరీక్షలు నిర్వహించాలి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– సుబ్బారావు, ఇన్‌చార్జి డీఈఓ

శబ్దం పెరిగిందో.. తీసేస్తారు!



రోడ్డుపై వెళ్తుంటే ఒక్కసారిగా పెద్ద శబ్దం వస్తుంది. చెవులకు చిల్లుపడే స్థాయిలో వినిపిస్తుంది. కొందరు ఆకతాయిలే దీనికి కారణం. వారు దీనిని క్రేజ్‌గా భావిస్తుంటారు. కంపెనీ నుంచి బైక్ కొనుగోలు చేసే సమయంలో ఇచ్చే సైలెన్సర్లను తొలగించి శబ్ద కాలుష్యాన్ని కలిగించే వాటిని అమరుస్తున్నారు. దీనిపై పోలీసులు కన్నెర్ర చేశారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను తొలగిస్తున్నారు.

- అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల వినియోగం
- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు
- 200 మోటార్‌బైక్‌లకు తొలగింపు



సైలెన్సర్‌ను తీయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

నెల్లూరు (క్రైమ్): నగరవాసులను శబ్ద కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మనిషి వినికిడి శక్తి బాగుండాలంటే 20 నుంచి 50 డెసిబెల్స్‌కు మించి శబ్దాలు వినకూడదన్న విషయాన్ని అనేక పరిశోధనలు ధ్రువీకరిస్తున్నాయి. అయితే నెల్లూరులో పరిస్థితి దారుణంగా ఉంది. నిత్యం వాహనాల రాకపోకలతో వచ్చే రణగొణ ధ్వనులు 100 డెసిబుల్స్‌కు మించి ఉంటున్నాయి. దీనికితోడు కొందరు యువత తమ ఖరీదైన మోటార్‌బైక్‌లకు ఎక్కువ శబ్దాలనిచ్చే హారన్లు, సైలెన్సర్లను బిగించుకుని అతివేగంగా వెళ్తూ.. శబ్దం చేస్తూ ఎదుటువారిని ఉలిక్కిపడేలా చేస్తున్నారు. ఆ సందర్భంగా 200 డెసిబెల్స్ శబ్దాలను వినాల్సి వస్తోంది. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌లో ఒక మనిషి అరగంటపాటు చిక్కుకుని బయటపడే సరికి తీవ్ర తలనొప్పితో బాధపడాల్సి వస్తోంది. పైపెచ్చు వినికిడి సమస్యలు సైతం వస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

వాహనంతో వచ్చిన విడిభాగాలను మాత్రమే చోదకులు వినియోగించాలి. సాధారణ సైలెన్సర్ల నుంచి నిర్దిష్ట మోతాదులో మాత్రమే శబ్దం వెలువడుతుంది. వాటికే రవాణా శాఖ అనుమతి ఇస్తుంది. అయితే కొందరు యువత దీనికి విరుద్ధంగా కంపెనీలు ఇచ్చిన లైసెన్సర్లు తొలగించి అధిక శబ్దం వచ్చే రకరకాల వాటిని అమర్చుకుంటున్నారు. ఒక్కో మోడల్ ఒక్కో రకం శబ్దం చేస్తుంది. ఇందుకోసం రూ.వేలు వెచ్చిస్తున్నారు. ఎక్స్‌లేటర్‌ను ఒక్కసారిగా వదులుతుండడంతో భరించలేని శబ్దం వెలువడుతోంది. దీంతో తోటి వాహనదారులు ఉలికి పడుతున్న పరిస్థితి ఉంది. నడిచి వెళ్లే వారికైతే ఒక్కసారి శబ్దం వినగానే గుండె ఆగినంత పనవుతోంది. కాగా మరికొందరు కంపెనీ సైలెన్సర్లు ఉంచినా దానిలో ఉండే ఫిల్టర్లు తీసేస్తున్నారు. దీని వల్ల కూడా శబ్ద తీవ్రత పెరుగుతుంది. ఇది కూడా నేరమే అంటున్నారు పోలీసు అధికారులు. నిర్దిష్ట మోతాదుకు మించి శబ్దాన్ని వినడం మూలంగా తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు అంటున్నారు. పర్యావరణ నిబంధనల ప్రకారం టూ వీలర్ నుంచి ట్రాక్టర్ వరకు ప్రతి వాహనానికి శబ్ద నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. సైలెన్సర్లు తప్పనిసరిగా ఉండాలి.



తొలగించిన సైలెన్సర్లతో ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

వచ్చే సమస్యలు

శబ్ద తీవ్రత వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. గుండె కొట్టుకునే వేగం, రక్తప్రసరణ వేగం అధికమవుతుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ఒక్కోసారి గుండెపోటు రావచ్చు. చెవి పనిచేసే శక్తిని కోల్పోవడంతోపాటు చెవుడు వచ్చే అవకాశం ఉంది. నిద్రపట్టదు. తలనొప్పి, త్వరగా అలసట వస్తుంది. మితిమీరిన శబ్దం మనిషిని మానసికంగా, శారీరకంగా కుంగదీస్తుంది.

కట్టడికి చర్యలు

నగరంలో వాహనాల కారణంగా నానాటికీ పెరిగిపోతున్న శబ్ద కాలుష్యానికి చెక్ పెట్టేందుకు ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ సైలెన్సర్లు మార్చిన, శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తున్న బైక్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. సైలెన్సర్లను తొలగించి దగ్గరుండి వాహన యజమానుల చేత కంపెనీవి పెట్టిస్తున్నారు. ఇప్పటి వరకు 200 పైగా వాహనాల లైసెన్సర్లను తొలగించారు. శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తున్న వాహనదారులపై భారీ జరిమానాలు విధించడంతోపాటు, యువతకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

చట్టం ఏం చెబుతుందంటే..

- ఒక వాహనం నిర్ణీత డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్ద కాలుష్యం సృష్టిస్తే అది మోటార్ వాహనాల చట్టం ప్రకారం నేరం.
- నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యం వచ్చే వాహనంపై పోలీసులతోపాటు రవాణా శాఖ అధికారులు కేసు నమోదు చేయొచ్చు.
- సంబంధిత వాహనచోదకుడికి రూ.1,000 జరిమానాతోపాటు కేసు నమోదు చేసే అవకాశం.
- రెండోసారి శబ్ద కాలుష్యానికి కారణమైతే రూ.2 వేల వరకు జరిమానా విధిస్తారు.

మనిషి వినగలిగే శబ్దం స్థాయి : 20 నుంచి 50 డెసిబెల్స్.

100 డెసిబెల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్న వారికి ప్రమాదం.

110 డిసిబెల్స్ మించితే చిరాకు, కోపం, తలనొప్పి వస్తుంది.

150 డెసిబెల్స్ దాటితే చెవిలోని కర్ణభేరి దెబ్బతినే అవకాశం ఉంది. ఒక్కోసారి నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం



వాహనాల శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నాం. అందులో భాగంగా శబ్ద కాలుష్యానికి గురిచేసే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ట్రాఫిక్ సిబ్బంది అన్ని ప్రధాన కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధిక శబ్దం వస్తున్న సైలెన్సర్లను తొలగించి వాటి స్థానంలో కంపెనీ ఇచ్చిన వాటిని వేయిస్తున్నారు. బైక్ రేసింగ్‌లు, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ తదితరాలపై సైతం నిరంతర తనిఖీలు జరుగుతూనే ఉన్నాయి. నిబంధనల ఉల్లంఘనులపై కేసులు నమోదు చేస్తున్నాం.

– సీహెచ్ విజయారావు, ఎస్పీ

కొత్త జోష్



ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్



మంత్రితో ఎస్పీ విజయారావు

- న్యూ ఇయర్ సందర్భంగా కిటకిటలాడిన ప్రముఖుల నివాసాలు

నెల్లూరు(సెంట్రల్): పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి ఎన్నో ఆశలతో కొత్త ఏడాదికి ప్రజలు స్వాగతం పలికారు. న్యూ ఇయర్ వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖుల నివాసాలు కిటకిటలాడాయి. అభిమానులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసానికి చేరుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్పీ విజయారావుతోపాటు ఇతర అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అదే విధంగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను అనేకమంది కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చారు.

పోలీస్ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరించిన ఎస్పీ విజయారావు, ఇతర పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైమ్): ఏపీ పోలీస్ అధికారుల సంఘం జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సర డైరీని ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదివారం నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ డైరీ సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేయాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, శ్రీనివాసరావు, సెబ్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీలక్ష్మి, డీఎస్పీలు, ఏపీ పోలీసుల అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, ఆర్ఐలు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	138
లేయర్ (లైవ్) :	85
బ్రాయిలర్ చికెన్ :	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	264
లేయర్ చికెన్ :	145



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ.15
సన్నవి: రూ.10
పండ్లు: రూ.4



క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య



మహేంద్ర మృతదేహం

నెల్లూరు(క్రైమ్): జీవితంపై విరక్తి చెంది పెయింటర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. బోడిగాడితోటకు చెందిన జి.మహేంద్ర (24)కు వివాహమైంది. కుటుంబకలహాల నేపథ్యంలో భార్య అతడిని వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరులోని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు మృతిచెందారు. మృతుడి తల్లి ఖాలా ఫిర్యాదు ఆదివారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



లబ్ధిదారుకు పెన్షన్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మండలంలోని సరస్వతీనగర్ కమ్యూనిటీహాల్లో ఆదివారం జరిగింది. తొలుత నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేక్ కట్ చేశారు. అనంతరం పలు గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు పెన్షన్ల నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో సామాజిక పింఛన్ ఇవ్వాలంటే ఆయా గ్రామాల్లో అప్పటికే పెన్షన్ తీసుకుంటున్న వ్యక్తులు మరణించినప్పుడు మాత్రమే మంజూరు చేసే దౌర్భాగ్య పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పెన్షన్ మంజూరుకు నిర్దేశించిన అర్హతలుండి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి 21 రోజుల్లోనే మంజూరు చేయడం జరుగుతోందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ పెన్షన్లు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని కొనియాడారు.

1,423 మందికి కొత్త పెన్షన్ల మంజూరు

సర్వేపల్లి నియోజకవర్గానికి కొత్తగా 1,423 పెన్షన్లు మంజూరైనట్లు మంత్రి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సాధారణ పరిశీలనలో భాగంగా 1,249 మందికి నోటీసులు జారీ చేయగా, అందులో 1,228 మందికి పెన్షన్లు కొనసాగిస్తున్నామని వివరించారు. సాధారణ పరిశీలనలో భాగంగా నోటీసులు జారీ చేస్తే, పెన్షన్లు తొలగిస్తున్నారంటూ టీడీపీ తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వ హయాంలో వివిధ రకాల సామాజిక పెన్షన్ల కోసం 39 లక్షల మందికి రూ.400 కోట్లు ఖర్చు చేయగా, నేడు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, కళాకారులు లాంటి 64 లక్షల మందికి ప్రతి నెలా రూ.1,765 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో పెన్షన్ల కోసం రూ.62,500 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని వివరించారు. సీఎం ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల తోటపల్లిగూడూరు మండలం చిన్న చెరుకూరు గ్రామానికి వెళ్లినప్పుడు ఎస్టీ మహిళ ఎదురువచ్చి పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలియజేసినట్లు చెప్పారు. అనంతరం ఎర్రగుంట ఎస్టీకాలనీలో కొందరు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెళ్లి పెన్షన్ల నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలతారెడ్డి, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్ నాయుడు, మందల మోహన్‌రావు, నాటకం శ్రీనివాసులు, తాటపర్తి సురేష్, వెలిబోయిన వెంకటేశ్వర్లు, చీకుర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో పడి వ్యక్తి మృతి



శివకుమార్‌రెడ్డి మృతదేహం

ఉలవపాడు: ప్రమాదవశాత్తు ఉప్పుటేరులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని బద్దిపూడిలో శనివారం రాత్రి జరగ్గా ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొలకలపూడి శివకుమార్‌రెడ్డి (38)కి పశువులున్నాయి. అవి ఇంటికి రాకపోయే సరికి వెతుకుతూ శనివారం రాత్రి ఉప్పుటేరు దగ్గరకు వెళ్లాడు. పశువులు నీటిలోకి దిగి ఉంటాయనే అనుమానంతో దుస్తులు ఒడ్డున పెట్టి దిగి మునిగిపోయాడు. శివకుమార్‌రెడ్డి ఆదివారం ఉదయం వరకు ఇంటికి రాకపోయే సరికి కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఉప్పుటేరు దగ్గరకు వెళ్లి చూడగా ఒడ్డున దుస్తులు కనిపించాయి. దీంతో ఆందోళన చెందిన వారు స్థానికుల సహాయంతో ఏరులోకి దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు పీహెచ్‌సీకి తరలించారు. శివకుమార్‌రెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాల వ్యాన్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం



మాలకొండయ్య మృతదేహం

వలేటివారిపాలెం: పాల వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పోలినేనిపాళెం ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పోలినేనిపాళెం గ్రామానికి చెందిన అత్తంటి చిన్న మాలకొండయ్య (71) గుడి దగ్గర నుంచి తన గ్రామానికి నడిచి వెళ్తున్నాడు. ఈక్రమంలో కందుకూరు వైపు నుంచి పాల వ్యాన్ వేగంగా వచ్చి ఆయన్ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై సుదర్శన్ యాదవ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.